www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబర్ 2023
5
అన్నమయ్య



'నేడు యథావిధిగా జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం – స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్–ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ఎపిని ఆర్థిక సంక్షోభంలో నెట్టేసిన వైసిపి

కేంద్రం రాష్ట్రపతి పాలనను విధించాలి
మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా డిమాండ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికార వైసిపి విధానాలతో ఏపీ భవిష్యత్తు ప్రమాదకరంలో పడిందని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకులు షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరు బస్టాండులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కక్షపూరిత రాజకీయాలకు ఏపీ కేంద్రంగా మారిందని, అప్పుచేసి పప్పుకూడు చందంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీ అందాల్సిన జీతాలు 10వ తేదీ అయినా అందకపోవడం, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో అందకపోవడం రాష్ట్ర పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు, పిల్లల భవిష్యత్తు కోసం,అన్ని వ్యవస్థలు బాగుపడాలంటే ఎపిలో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకు, అభివృద్ధి కోసం పరితపించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అప్పుడు కేసులో ఇరికించి జైల్లో పెట్టి వేధించడం సమంజసం కాదన్నారు. నెల ఎనిమిది రోజులు ఏసీ కేటాయించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఎపికి త్వరలోనే మంచి రోజులు వస్తాయని, రాష్ట్ర ప్రజలు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటుతోనే తమ తడాఖా చూపిస్తారని ఆయన స్పష్టం చేశారు .అనంతరం పేదలకు షాజహాన్ బాష చేతుల మీదుగా కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు జునైద్ అక్బరీ, నాగూర్ వలి, నవీన్ చౌదరి, షంషీర్, ఇంతియాజ్, నాదెళ్ల శివన్న, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, పూలకుంట్ల హరిబాబు, బాలమాలి శేఖర్, హసీనా, నాగమణి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని పొదుపు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎలా అభివృద్ధి చెందాల్లో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాలో డిఆర్‌డిఎ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లాలో జిల్లా సమాఖ్య కార్యాలయం 1, డిఆర్‌డిఎ కార్యాలయంతో పాటు 30 మండలాల్లో 30 మండల సమాఖ్యలు స్వయం సహాయక సంఘాలు అందుబాటులో ఉన్నాయి.

డిఆర్‌డిఎ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించండి?

మహిళా సంఘాల ఏర్పాటు చేయడం, వాటి సామర్థ్యాలను పెంపొందించడం, బ్యాంక్ లింకేజీ కార్యక్రమం ద్వారా లోన్స్ ఇప్పించడం, స్త్రీనిధి ద్వారా జీవనోపాధులకు ఆర్థిక సాయం చేయడం, ఇవ్వడం, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల మహిళలకు సున్నా వడ్డీకే జీవనోపాధులకు రుణాల పంపిణీ చేస్తాం. రైతు ఉత్పత్తి దారుల సమాఖ్యల ఏర్పాటు వాటికి ఆర్థిక సహాయం, అభయహస్తం పెన్షన్, సామాజిక భద్రత పెన్షన్స్, వైఎస్ఆర్ చేయూత వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నావడ్డీ, జగనన్న పాల వెల్లువ మొదలగు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

జిల్లాలో మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి? సభ్యులు సంఖ్య ఎంత?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 30,412 సంఘాలున్నాయి. 3,00,037 మంది సభ్యులున్నారు.

వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద పొదుపు సంఘాలకు ఎంత చేయూత అందించారు?

వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద పొదుపు కోసం బ్యాంక్ రుణాలు రూ.261 కోట్లు,స్త్రీనిధి రూ.88 కోట్లు అందిస్తున్నాం.

వైఎస్ఆర్ బీమా కింద ఎంతమందని నమోదు చేశారు?

ఈ సంవత్సరం ఇప్పటివరకు 232 మందిని వైఎస్ఆర్ బీమా కింద నమోదు చేశాం.

మహిళలకు ఏమైనా సలహాలు, సూచనలను ఇవ్వాలనుకుంటున్నారా?

మహిళలు తాము తీసుకున్న రుణాలను సక్రమమగా జీవనోపాధుల కోసం ఉపయోగించుకొని తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలి. అలాగే రుణాల చెల్లింపు విషయంలో, సమావేశాల నిర్వహణ, పుస్తక నిర్వహణ మొదలగు విషయాల్లో మంచి క్రమశిక్షణ కలిగి సంఘాలు అభివృద్ధిలోనికి తీసుకురావాలి.

దేశ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యం

మదనపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సాహెబ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతదేశ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మదనపల్లి నియోజకవర్గం నాయకులు, పట్టణ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి పట్టణం,ఎగువ కురవంక ,నిమ్రాహ్ మసీదు సమీపంలో కురవంక యూత్ సయ్యద్ బేగ్, షేక్ సోనుల సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 52 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్.రెడ్డి సాహెబ్ హాజరయ్యారు. ముందుగా స్థానిక యువత బాణాసంచా పేల్చి, పూలమాలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీలో చేరిన యువతకు ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. యువత పిట్టు, ఫయాజ్, లాలున్, అనీష్, ఇసాక్ కురువంక యువత కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశంలో సర్వమత సంక్షేమానికి, అభివృద్ధి బాటలు వేస్తుందన్నారు. యువత ఉత్సాహం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి తొందరలోనే పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని యువత మొత్తం బలపరిచి, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ముందుండి నడిపించాలని కోరారు. దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర అమోఘమైందన్నారు.ప్రస్తుతం బిజెపి అవలంబిస్తున్న విధానాలతో దేశ ప్రజలు విసిగిపోయారని,కాంగ్రెస్ పాలన కోసం ఆత్రుతగా వేచి చూస్తున్నారన్నారు.సర్వ మానవ సమానత్వమే తమ పార్టీ విధానమని లౌకికవాదానికి సరైన నిర్వచనం చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన ఉద్ఘాటించారు. త్వరలో నిర్వహించబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కర్ణాటక ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని ఆయన ధీమా చేశారు.ఇ ందులో భాగంగా పార్టీలో చేరిన యువతకు బాస్కెట్ బాల్ కిట్ ను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, వై.సురేంద్ర రెడ్డి,డాక్టర్ ఎస్.కే.బాషా, మహమ్మద్ రఫీ, మహబూబ్ పీర్, మహమ్మద్‌అలీ, సయ్యద్ ఖాసిం, పాలేటి, బాబ్ జాన్, అల్లా బక్షు, కురవంక యువత పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- సుగవాసి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి - రాయచోటి

యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు, నియోజక వర్గ టిడిపి నాయ కులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని మాసాపేటలో క్రికెట్ క్లబ్(ఎంసిసి) ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, అందరూ స్నేహభావంతో, ఐకమత్యంతో ఎటువంటి సమస్యలు లేకుండా టోర్నమెంట్ ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని చెప్పారు. క్రీడాకారుల మధ్య స్నేహ భావం కూడా పెంపొందుతుందన్నారు. క్రీడా పోటీలలో విజేతలకు విన్నర్స్‌కు రూ.60 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఒకటవ వార్డ్ కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్ ,2వార్డు కౌన్సిలర్ ఇన్‌చార్జి సుగవాసి శ్యామ్ కుమార్, బ్యాంక్ మేనేజర్ నవాజ్, గాలివీడు శివారెడ్డి, మాజీ కౌన్సిలర్ అమరనాథ్, మలిగెల బాషా, కొట్టే శ్రీనివాసులు, సుగవాసి సత్య, రాజశేఖర్, సనావుల్లా సార్, ముత్తు కూరు రఫీ,మన్నేరు రాజ, అల్లబాకష్, ఇనాయతుల్లా, సుగవాసి పాలా, మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, సహదేవా పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుగవాసి ప్రసాద్‌బాబు



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఆదివారం ఎస్ఏ–1 కల్యాణమంటపాన్ని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. మండపం యజమాని సాబ్జాన్ మేడా, పోలా శ్రీనివాసులు రెడ్డికి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎస్ఎ–1 కల్యాణమండపాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ వార్డు కౌన్సిలర్లు, రాజంపేట మండల వైసిపి ప్రజా ప్రతినిధులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిద్దాం

రాయచోటి టౌన్ : కార్మికులకు పనితగ్గ వేతనం ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నేలపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పాతరాయచోటిలోని దళితవాడలో ఈనెల 31న నిర్వహించబోయే ఎఐటియుసి 104 ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివతో కలిసి మాట్లాడారు. 2014 ఎన్‌డిఎ ప్రభుత్వం బిజెపి మోడీ నాయకత్వాన వచ్చిన నాటి నుంచి కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, సౌకర్యాలను కాలరాస్తోందని చెప్పారు. 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా కార్మిక హక్కులను కాలరాసిందని పేర్కొన్నారు. 8 గంటల పని దినం స్థానంలో 12 గంటల పనిదినం వచ్చిందన్నారు. హక్కులు అడిగితే జైళ్ళు నోళ్ళు తెరుస్తున్నాయని, విధుల నుంచి తొలగింపులు, పరిశ్రమల మూసివేతలు సర్వసాధారణమై పోతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, సీనియర్ నాయకుడు వెంకటేశు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శేషాద్రి,అబ్దుల్లా, అంజినేయులు,రమణ, లలితమ్మ, మౌనిక, రజినీ పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారిపల్లిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన ఆదివారం అమ్మవారు పసుపు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా శ్రీచౌడేశ్వరి అమ్మవారిని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలకు ప్రతిష్టాత్మకమైన ఏర్పాట్లు చేశారని కితాబునిచ్చారు. ప్రజలందరిపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశామన్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిస్తారన్నారు. చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నార్పవరం వెంకటేష్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు,మహబూబ్ ఖాన్, వెంకటేష్ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న శ్రీరాం చిన్నబాబు

దాడులు చేయడమే వైసిపి పని

రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి నేతలపై దాడులు చేయటం, పీడీ యాక్టులు పెట్టడమే లక్ష్యంగా వైసిపి పాలన సాగుతోందని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కురబలకోట మండలం, అంగళ్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కప్పిర శ్రీనివాసులుకు అక్రమ కేసుల హానితోపాటు ప్రాణహాని ఉందన్నారు. వారి ఇంటి ముందు అజ్ఞాత వ్యక్తులు తిరుగు తున్నారని, ఆ వ్యక్తులు చుట్టపక్కల ఇళ్ళకి వెళ్లి గంజాయి అమ్ముతున్నారనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కప్పిర శ్రీనివాసులు 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని ,స్థానికంగా ప్రజల దీవెనలు నిండుగా ఉన్నాయని చెప్పారు. .పోలీసులు ఈ విషయంపై విచారించాలని అందుకుగాను తాము సిసి వీడియోలు అందజేస్తామన్నారు. కప్పిర శ్రీనివాసులకి హాని ఉందనే విషయాన్ని నారాలోకేష్‌కు తెలియజేశామన్నారు. అధికార పార్టీ నేతలు చెప్పారని అక్రమ కేసులు పెడితే పోలీసులు ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. అక్రమ కేసులు పెడితే న్యాయపోరాటం చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి అటుంచితే, టిడిపిలో బలవంతులైన కార్యకర్తలని కేసుల్లో ఇరికిస్తున్నారని ఆరోపించారు. దాడులు చేసి, ఇబ్బందులు పెట్టి,పీడీ యాక్టులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్యకర్తలకు ఏ చిన్న ప్రమాదం జరిగినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం ఇటువంటి విధానాలను విడనాడి, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రుద్ర బాలకృష్ణ ,మోహన్ రెడ్డి, అయూబ్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర యాదవ్

బిటి కళాశాలను సందర్శించిన శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ కళాశాలకు ఆదివారం తిరుపతికి చెందిన శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు విచ్చేశారు. శ్రీ విద్యానికేతన్ సైన్స్ టీచర్, కళాశాల పూర్వ విద్యార్థిని అయిన సి. శైలజ, ఫిజిక్స్ టీచర్ బి. శ్రీనివాస్ నేతృత్వంలో విద్యానికేతన్‌కు చెందిన 22 మంది విద్యార్థులు కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని ఆఫీస్, బెసెంట్ హాల్ అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువాదం చేసిన కళాశాల కాటేజీని పరిశీలించారు. స్వతంత్ర సమర యోధురాలు అనీ బెసెంట్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నడయాడిన ఒక చారిత్రాత్మక కళాశాలను చూసి విద్యార్థులు, సిబ్బంది పరవశానికి గురయ్యారు. డాక్టర్ అనిబిసెంట్ విగ్రహం వద్దా, రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్దా ఇంకా కళాశాలలోని పలుచోట్ల వారు గ్రూప్ ఫొటోలు దిగారు. విజిటర్స్ బుక్కులో తమ సందేశాలను నమోదు చేశారు. ఇంతటి చరిత్ర కలిగిన కళాశాలను సందర్శించుకోవడం చాలా సంతోషం కలిగించిందని విద్యార్థులు అన్నారు. శైలజ మాట్లాడుతూ తమ విద్యార్థులతో కళాశాలకు వచ్చి సందర్శించుకోవడానికి అనుమతి కోరుతూ ఇ–మెయిల్ పంపినప్పుడు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఆనంద్ రెడ్డి గారు వెంటనే స్పందించి అనుమతిచ్చారని అందుకు వారికి ధన్యవాదాలని అన్నారు. శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు, టీచర్లు బీటీ కళాశాల చేరుకోగానే కళాశాలకు చెందిన వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. శ్రీనివాసులు ఇతర సిబ్బంది దగ్గరుండి కళాశాలలోని దర్శనీయ స్థలాలను వారికి చూపించారు.





బిటి కళాశాలను సందర్శిస్తున్న విద్యార్థులు

సేగు రెడ్డెప్పరెడ్డికి ప్రధాని ప్రశంసలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో సంతృప్తి చెందిన ప్రధాని మోడీ నుంచి అధ్యాపకులు సేగు రెడ్డెప్పరెడ్డికి ప్రశంసలు అందాయి. శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాన్ని పంపారు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయులు కీలకమైన వ్యక్తులుగా ఉంటారని, వారి కలలు కనడం నేర్పి, ఆ కలలను బలమైన తీర్మానాలుగా మార్చడం ద్వారా వాటిని సాకారం చేసే దీపం లాంటి వారని ఉపాధ్యాయులని చెప్పారు. 2047 సంవత్సరం నాటికి దేశానికి అమృతకాల సమయమని మన ప్రతిభావంతులైన యువత ముందు గొప్ప, అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించే అవకాశం ఉందని ప్రధాని సందేశాన్ని పంపారు. మీ ఆలోచనలను పంచుకున్నందుకు మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.





వైసిపిలో చేరిన టిడిపి కార్యకర్తలు

వైసిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుండుపల్లి మండలం గుండ్లపల్లి గ్రామపంచాయతీ కేతిరెడ్డి గారి పల్లెకు చెందిన టిడిపి కార్యకర్తలు సుమారు 20 కుటుంబాల వారు ఆదివారం రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి సమక్షంలో బోయినపల్లిలోని ఆయన పార్టీ కార్యాలయంలో వైసిపి కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఎమ్మెల్యే మేడా నాయకత్వం నచ్చి వైసిపి తీర్థం పుచ్చుకున్నట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో పవన్ కుమార్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, చెన్నూరు మునయ్య, బాలిపోగు ఆంజనేయులు, చెన్నూరు శ్రీనివాసులు, బాలిపోగు హరి, బాలిపోగు వెంకటేష్, సలవ మల్లిఖార్జున, జంగంపల్లి కొండయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణపై సంబరాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అతిపెద్ద విగ్రహం, శనివారం అమెరికాలో ఆవిష్కృతమైంది. అగ్రరాజ్యం అమెరికాలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మదనపల్లెలో వికెసి పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. అమెరికాలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జరుగుతున్నంత సేపూ, అంటే భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 8–15 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకూ ఎంతో ఉత్సాహభరితంగా సంబరాలు చేసుకున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమెరికాలో ఆవిష్కరించిన అంబేద్కర్ విగ్రహం ఫోటో బ్యానర్‌ను ప్రదర్శించి,బ్యానర్ ముందు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వికెసి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ అగ్రరాజ్యం అమెరికాలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని చెప్పారు. ఇది భారత పౌరులందరికీ ఎంతో గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ సభ్యులు ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, బహుజన ఉద్యోగ నాయకులు చిట్టిబాబు, గంగాద్రి పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న వికెసి పార్టీ నాయకులు



గ్రంథాలయానికి హాజరైన విద్యార్థులు

'గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

దసరా సెలవుల సందర్భంగా బి.కొత్తకోట శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం చదువంటే మాకిష్టం అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు గ్రంథాలయాధికారి ఎం.తులసినాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవంటే మాకిష్టంలో భాగంగా దివారం 20 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. దసరా సెలవులను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా గ్రంథాలయానికి విచ్చేసి చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాలంటీర్ షకీల్, ఉపాధ్యాయులు వెంకటేష్ పాల్గొన్నారు.



ఆలయానికి మైక్ సెట్‌ను అందిస్తున్న సర్పంచ్

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-నందలూరు

చెన్నై ప్రధాన రహదారిలోని కన్యకచెరువు అలుగు సమీపంలో వెలసిన శ్రీ అనంతపురమ్మ ఆలయానికి నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తల్లి వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం రూ.20వేలు విలువ చేసే మైక్‌సెట్ వితరణ గావించారు. రెండు మైకులు, ఆమ్లిఫైర్, రిమోట్, ఎలక్ట్రిషన్ ద్వారా ఆలయంలో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయఅభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తుమ్మల రాజేష్, వెంకటసుబ్బయ్య సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అక్కి వెంకటరమణ, ఎముక దుర్గయ్య, రేగిమడుగు శంకర, తుమ్మాది శివ, ఆది, సుబ్బయ్య, శివ నరసింహులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో 'నల్లారి'

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ లోని గుర్రంకొండవీధిలో నివాసమున్న టిడిపి నాయకులు కరీముల్లాబాషా కుమారుని పెళ్లికి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. రాయచోటి పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మనకులో జరిగిన వివాహానికి ఆయన హాజరై కార్యకర్తలతో ముచ్చటిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అరాచకాలను ప్రజలు చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మచ్చలేని పరిపాలనకు ఆదర్శంగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అక్రమ అరెస్టులతో జైలులో ఉంచిన విషయం ప్రజల గమనిస్తున్నారని దీనికి వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలో నాయకులు రవి, వెంకటేశ్వరరావు, మల్లికార్జున నాయుడు, నౌషద్‌బాషా, శ్రీనివాసులురెడ్డి ,అహ్మద్ బాషా, హబీబ్ పాల్గొన్నారు.



పాడైపోయిన మోటర్‌కు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-బి. కొత్తకోట

పట్టణ పరిధిలోని బెంగళూరు రోడ్డులో గల పెయింటర్స్ కాలనీ కొరకు తవ్వించిన బోరుబావిలోని చెడిపోయిన విద్యుత్ మోటారును కమిషనర్ పి.ఆర్.మనోహర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఆదివారం మరమ్మతులు చేశారు. కాలనీ నందు నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను సిపిఐ నాయకులు అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్

సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు ప్రజల్లో నాటుపోయాయని వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి షేక్‌జాకీర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని రామాపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి ని చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం లో శ్రీకాంత్ రెడ్డికి అఖండ మెజార్టీతో గెలిపిస్తారన్నారు. ఎమ్మెల్యే గడప గడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వృద్ధులకు పింఛన్ రూ.3వేల వరకు పెంచారని అన్నారు. సమావేశంలో మండల మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా. జాఫర్, జమీల్, ఇంతియాజ్, చిన్నరెడ్డి పాల్గొన్నారు.

రేపు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

బి.కొత్తకోట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి 17న నియోజకవర్గ పర్యటనలో భాగంగా బి.కొత్తకోట, పిటిఎం మండలాలకు వస్తున్నారని వైసిపి పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. రెండు మండలాల్లో పూర్తయిన సచివాలయాలు ,రైతు భరోసా కేంద్రాలు, జగనన్న కాలనీ, వెల్నెస్ సెంటర్లను ప్రారంభిస్తారన్నారు. అంతేకాకుండా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. మండలాల్లోని వైసిపి నాయకులు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, నాయకులు, హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా భారతరత్న అబ్దుల్‌కలాం జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

క్షిపణి పితామహుడు, భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఆదివారం స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో అబ్దుల్ కలాం చిత్రప టానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ పేపర్‌బాయ్ స్థాయి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన గొప్ప వ్యక్తి కలాం అన్నారు. తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగవాహనం ఎస్ఎల్‌వి-3 ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయవంతమైన బాధ్యత వహించిన కలాం దేశ అంతరిక్ష ప్రయోగాలకు, దేశరక్షణకు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమా మంజుల, సిబ్బంది బావాజాన్, రెడ్డెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : అబ్దుల్ కలాం 92వ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక వాకర్స్ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నారు. అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తుల్లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఒకరని, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి, సాంబశివయ్య, నాగ భూషణం ,ఒలేటిప్రసాద్, వాకా హరునాథ్‌రెడ్డి, నరసింహులు, సైపుల్లా, పాల్గొన్నారు.



వాల్మీపురం : అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మజ్దూర్ యూనియన్‌ను గెలిపించండి



మజ్దూర్ యూనియన్ గెలిపించాలని కోరుతున్న నాయకులు

ప్రజాశక్తి-నందలూరు

ఈ నెల 19న జరగనున్న రైల్వే సహకార సొసైటీ పాలక మండలి ఎన్నికలలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బలపరుస్తున్న 28 మంది డెలిగేట్‌లకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ కె.సుదర్శన్‌రాజు నందలూరు, హస్తవరము, రాజంపేట, పుల్లంపేట, కోడూరు ప్రాంతాలలో ఉన్న రైల్వే సొసైటీ సభ్యులను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ లాభాలలో ఉండేందుకు, ఏటువంటి లంచం తీసుకోకుండా సభ్యులకు లోన్ ఇప్పించేందుకు, ప్రతి సంవత్సరం సభ్యులకు డివిడెంట్ ఖచ్చితంగా అందాలంటే సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌కు మాత్రమే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పి.గోపీ నాథ్, సెక్రెటరీ కె.విశ్వనాథ్, ట్రెజరర్ ఎస్. వెంకటసుబ్బయ్య, ఎం.శ్రీహర్ష, మహబూబ్ బాషా, సుధీర్, సిద్ధయ్య, నారాయణ, డెలిగేట్‌గా పోటీ చేయుచున్న పి.గురు వినోద్ కుమార్, రవీంద్ర నాయక్‌లు పాల్గొన్నారు.

ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రోజు ఆదివారం దీక్షా బంధన అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్‌శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుం జయశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, స్వస్తివాచనం, కలశ స్తాపన, పంచా మృతాభిషేకం, సప్తశతి పారాయణం, నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఉభయ దారులుగా మాకం వెంకట కుమార్ ధర్మపత్ని జయశ్రీ, యంబలూరు నరసింహప్రసాద్, రజం రామకృష్ణయ్య ధర్మపత్ని కళ్యాణిలు ఉభయ దారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శెట్టి ఉమ్మడిశెట్టి యంబలూరు నరసింహారావు, అధ్యక్ష, కార్యద ర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి సభ్యులు పాల్గొన్నారు. **కలకడ:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుర్రంకొండ మండలం చెర్లోపల్లిలో వెలిసిన శ్రీ రెడ్డమ్మ తల్లిని భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి అమ్మవారి కృపకు పాత్రులు అయినట్లు ఆలయఅర్చకులు తెలిపారు. పంచాయతీ నడిమిచర్లకు చెందిన హాస్టల్ వార్డెన్ తమ కుటుంబ సభ్యులతో వెళ్లి దర్శనం చేసుకున్నారు. **కంభంవారిపల్లి :** వేణుగోపాల స్వామి గుడి ప్రారంభోత్సవంలో యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు బుర్రవండ్లపల్లిలో వేణుగోలస్వామి ఆలయం ప్రారంభించారు ఈ. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజు జీవన శైలిలో ఓక భాగంగా అలవర్చుకోవాలని అన్నారు. మండలంలో ఆలయ నిర్మాణాలకు తన వంతు కృషి చేస్తాను అన్నారు. పది రోజుల పాటు మహ భారత యజ్ఞం లో బాగంగా కథలు, నాటకం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రగిరి ఎల్లయ్య, వగల్ల సర్పంచ్ రామ్‌కొండారెడ్డి, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, బుర్రవాండ్లపల్లి ప్రజలు పాల్గొన్నారు. **పీలేరు :** విజయదశమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు పీలేరు పట్టణంలో శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి. పట్టణంలోని శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ, కన్యకా పరమేశ్వరి, ఇందిరమ్మ కాలనీలోని దిన్నె గంగమ్మ ఆలయాల్లో ఆయా ఆలయాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో తొలిరోజైన ఆదివారం రౌద్రాల అంకాళమ్మ బాలాత్రిపుర సుందరీ దేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారు వాసవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ఆరంభం సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చోరీ కేసులో అంతర్రాష్ట్ర నిందితులు అరెస్టు

22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం :డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, సిఐ ఎస్.మహబూబ్ బాషాకి రాబడిన సమాచారంపై ఎస్ఐ సి.హరిహర ప్రసాద్, సిబ్బంది కలిసి మదనపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు బెంగళూరులో రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాల్లో పోలీసులను చూసి వెనక్కు వెళ్లే ప్రయత్నం చేశారన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారు వివిధ ప్రాంతాలలో వివిధ కంపెనీలకు చెందిన 22 మోటార్ సైకిల్ ను పెద్దమనుషుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన నిందితులు కర్ణాటక రాష్ట్రం, మస్తి మాలూరు హోబలికి చెందిన చెల్లప్ప కుమారుడు కావడి శ్రీనివాస్, బి.కొత్తకోట మండలం, బడికాయలపల్లికి చెందిన కృష్ణప్ప కుమారుడు వరదరాజులు, బాసిని కొండ, పుంగనూరు రోడ్డు కు చెందిన పకు సాబ్ కుమారుడు షేక్ అజీజ్, తనకళ్ళు మండలం, కొక్కంటి కి చెందిన లేట్ మధార్ సాబ్ కుమారుడు షేక్ మహమ్మద్ రసూల్, మొలకలచేరువు మండలం, పాతమొలకలచేరువుకు చెందిన వరదరాజులు కుమారుడు కావడి శేఖర్‌లను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 22 మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన మూడు బైక్‌ల వివరాలు సేకరించాల్సి ఉందని, మరి కొంతమంది వ్యక్తులు పరారీలో ఉన్నారని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తామని తెలిపారు. నిందితులను చాకచక్యంగా అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కె.కేశప్ప

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా వాడాలని ఎస్ఐ వెంకట శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం గేటు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన ప్రాణాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించడం ద్వారా ప్రాణాన్ని రక్షించు కున్న వారు అవుతారని పేర్కొన్నారు. వాహనాల లైసెన్సు, రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. చిన్నపిల్ల లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. అలా ఇచ్చి ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులపై కేసునమోదు చేస్తామన్నారు. అతివేగంతో ద్విచక్రవా హనాలు నడిపి ప్రాణాలను కోల్పోవద్దన్నారు. చాలా మంది యువత అతివేగంతో వాహనాలు నడిపి ప్రాణాలను పోగొట్టు కొని తల్లింద్రులను శోకసంద్రంలోకి నెట్టేస్తున్నారని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వాహనాలు జాగ్రత్తగా నడపాలని సూచించారు.



ద్విచక్రవాహన దారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ శివకుమార్



పోలీసు స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన

మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- పీలేరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలనసాగిస్తున్నారని మాజీ మంత్రి ఎన్. అమరనాథ్‌రెడ్డి తెలిపారు. అంగళ్ల కేసు కండీషన్ బెయిల్‌లో భాగంగా రెండు వారాలపాటు ప్రతి ఆది, గురువారాల్లో పీలేరు పోలీసు స్టేషన్లో సంతకాలు చేయాలన్న రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పీలేరు పోలీసు స్టేషనుకు మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాజంపేట ఎంపీ అభ్యరి గంటా నరహరితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రత్యర్థులను నయానో, భయానో లొంగదీసుకోవడం, లొంగకపోతే అంతం చేయడం ఫ్యాక్షనిస్టుల లక్షణమని, దశాబ్దాల ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన వైఎస్ కుటుంబం నుంచి వచ్చిన జగన్ అదే పంథాను రాజకీయాల్లో కూడా జొప్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎదురు తిరిగిన వారిపై భౌతిక దాడులకు పాల్పడడం, అమాయకులను వేధింపులతో ఆయన, ఆయన పార్టీ నేతలు రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో ప్రతిపక్షం కూడా అంతే ముఖ్యమన్న ప్రాథమిక రాజకీయ సూత్రాన్ని మరిచి సిఎంగా తాను అధికారంలో ఉండగానే ప్రతిపక్షమనేదే లేకుండా చేయాలన్న దుష్ట ఆలోచన అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రాజెక్టుల పర్యటనకు వచ్చిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టిడిపి నాయకులపై దాడులకు పాల్పడ్డమే కాకుండా అక్రమంగా, అన్యాయంగా 307 సెక్షన్ కింద అక్రమ కేసులు బనాయించడం దురదృష్టకరమన్నారు.



జనసేన కండువా కప్పుకున్న యువకులు

జనసేనలో చేరిన యువత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సయ్యద్ ముఖరం చాన్ ఆధ్వర్యంలో రాజంపేటకు చెందిన సుమారు 150 మంది యువకులు రాజంపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ముకరం చాన్ మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు బాటలు వేయాలంటే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలోని యువత జనసేనానికి ఆశయాలకు అండగా నిలబడి ఉందని చెప్పడానికి రాజంపేట యువతే నిదర్శనమని తెలిపారు. రానున్న ఎన్నికలలో వైసిపికి రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడడం ఖాయమని అన్నారు. సుమారు 150 మంది యువత స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరడం శుభపరిణామమని, యువతకు తాము అన్ని విధాల అండగా నిలబడతామన్నారు. 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిదే అధికారం : గంటా నరహరి

ప్రజాశక్తి-పీలేరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిదే విజయమని రాజంపేట పార్లమెంటు సభ్యుడు గంటానరహరి పేర్కొన్నారు. వైసిపి నాయకులంటున్న వైనాట్ 175 అన్న విధంగానే ఆ 175 సీట్లలో టిడిపికి అధికారం కట్టబెట్టాలని ప్రజలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారని అన్నారు. అంగళ్లు ఘటనలో ఉన్న తన అంగరక్షకుడు గుర్మిత్ సింగ్ కు తెలుగు రాదని, ఆయనతో తెలుగులో స్టేట్మెంట్ తీసుకుని కేసులు నమోదు చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు.

క్రైం కార్నర్



సురేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

ప్రజాశక్తి-కలికిరి

వేగంగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కలికిరి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు..ఇందిరమ్మకాలనీకి చెందిన ఎస్.సురేష్(30) ఆదివారం మధ్యాహ్నం చింతపర్తిలోని తన చిన్నాన్న చంద్ర ఇంటకి వెళ్లి తిరిగి కలికిరిలో తన ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మదనపల్లి-తిరుపతి రోడ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో మూరేవాండ్లపల్లి క్రాస్ వద్దకు రాగా కలికిరి వైపు నుంచి వాయల్పాడు వైపు వెళుతున్న ట్రాక్టర్ డ్రైవరు అజాగ్రత్తగా వుగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఎఎస్ఐ మధుసూదనాచారి తన సిబ్బందితో ప్రమాదస్థలం వద్దకు వెళ్లి రక్తగాయాలతో ఉన్న సురేష్‌ను ఒక ప్రయివేట్ వాహనంలో కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుని చేర్పించారన్నారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని తెలిపారని అన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య ఎం.అనిత ఫిర్యాదుపై ఎస్.ఐ.రహీముల్లా ఆదేశాల మేరకు హెచ్‌సి మనోహర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు

-ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ రోషన్(18) అక్కడికక్కడే మృతిచెందగా. షేక్ తోహత్ తీవ్ర గాయాల పాలైనట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. రాయచోటి చెందిన వీరిద్దరూ టీ తాగడానికి ఐరిష్ గ్రాండ్ హోటల్ వద్దకు ద్విచక్ర వాహ నంలో బయలుదేరారని, కడప వైపు నుంచి వస్తున్న కంటైనర్‌ను రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఢీకొట్ట డంతో రోషన్ అక్కడక్కడ మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేపడతామని ఎస్ఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహన చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ ఎస్.జిలానిబాషా తెలిపారు. ఎఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలానికి చెందిన మొరంపల్లి నరసింహులు గత నెల 25న రాత్రి తన ఇంటి వద్ద రోజు లాగానే ఇంటి ముందర రోడ్డుపై తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి, ఇంటిలో పడుకోవడం జరిగిందన్నారు. మరిసటి రోజు ఉదయాన్నే నిద్రలేచి చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించలేదన్నారు. ఆరోజు నుంచి తన ద్విచక్ర వాహనం ఆచూకీ కోసం వెతికిన కనిపించలేదన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు చేయగా పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీ శాఖ నిఘా విభాగానికి అందిన రహస్య సమాచారం మేరకు దాడుల్లో రెండు వాహనాలతో సహా ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ వెంకటరమణ తెలిపారు. సుండుపల్లె నుంచి తమిళనాడు రాష్ట్రానికి ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు సమాచారం అందడంతో శనివారం రాత్రి తాము చిత్తూరు జిల్లా కల్లూరు పట్టణం సమీపంలోని బాహుబలి డాబా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. పీలేరు వైపు నుంచి వస్తున్న పల్సర్, మారుతి స్విఫ్ట్ వాహనాలను ఆపగా వాటి డ్రైవర్లు వాటిని కొంత దూరంలో చీకట్లో ఆపి పారిపోయారన్నారు. ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా స్విఫ్ట్లో 159 కిలోలు బరువున్న ఐదు ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయని తెలిపారు. వాటిని తమ కార్యాలయానికి చేర్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో తనతోపాటు సిబ్బంది ప్రతాప్, చరణ్. వెంకటేశ్ పాల్గొన్నారని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు, దుంగలతో పీలేరు అటవీ సిబ్బంది